క్లుప్తంగా

జగనన్న సురక్ష అమలుకు ఇంటింటి సర్వే



వెంకటాపురంలో జగనన్న సురక్ష సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు కుటుంబసభ్యులు వలంటీర్లకు తగిన సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు జగనన్న సురక్షపథకం అమలులో భాగంగా మండలంలోని కామందొరవలసలో శనివారం సర్పంచ్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేకార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అధికారులకు సన్మానం



ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులను సన్మానిస్తున్న హౌసింగ్ సిబ్బంది

బలిజిపేట: గృహ నిర్మాణాల అంశంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పార్వతీపురం మన్యం జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్‌వీ ప్రసాద్‌బాబు, గతంలో బలిజిపేట ఎంపీడీఓగా పనిచేసిన భానుమూర్తిని హౌసింగ్ సిబ్బంది సన్మానించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హౌసింగ్ శాఖ ఉత్తమ ఈఈగా ప్రసాద్ బాబును గుర్తించారు. కార్యక్రమంలో డీటీ రత్నకుమారి పాల్గొన్నారు.

ఎంఈఓ మల్లేశ్వరరావు సేవలు మరువలేనివి



మల్లేశ్వరరావుకు జ్ఞాపిక అందిస్తున్న ఉపాధ్యాయులు

మక్కువ: మండలంలో దాదాపు పదేళ్లుగా మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిపోతున్న వి.మల్లేశ్వరరావు సేవలు మరువలేనవని ఎంఈఓలు సత్యానారాయణ, శ్యామ్‌సుందర్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏంఈవో మల్లేశ్వరరావును సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ, పదేళ్లపాటు విద్యారంగ అభివృద్ధికి మల్లేశ్వరరావు ఎంతో కృషి చేశారన్నారు. బొబ్బిలి మండలం కోమటిపల్లి పాఠశాలకు బదిలీ జరిగిందని, అక్కడ కూడా మల్లేశ్వరరావు మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాచిపెంట: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టడంతో పాటు గుమడాం జగనన్న కాలనీలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎలక్ట్రికల్ ఏఈ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

150 సారా ప్యాకెట్లు స్వాధీనం

సాలూరు: సారా తరలిస్తున్న ఓ వ్యక్తి నుంచి 150 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. ఒడిశా రాష్ట్రం లావుడి ప్రాంతానికి చెందిన కె.మహేష్ అనే యువకుడు శుక్రవారం తన ద్విచక్రవాహనంపై 150 సారా ప్యాకెట్లతో సాలూరు వైపు వస్తుండగా.. జీగిరాం జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం రవాణా చార్జీలపై విచారణ జరపాలి

పాలకొండ: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు అమ్మిన ధాన్యం రవాణా చార్జీలలో అవకతవకలు జరిగాయని ఏపీ రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు ధాన్యం తరలించుకుంటే రవాణా చార్జీలు చెల్లించేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి రవాణా చార్జీలు విడుదలైనా.. రైతులకు మాత్రం అందలేదని తెలిపారు. మిల్లర్లతో కొంతమంది అధికారులు కుమ్మక్కు కావడంతో రవాణా చార్జీలు పక్కదారి పట్టించి స్వాహా చేశారని ఆరోపిచాంచారు. దీనిపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

- మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు: సంక్షేమ పథకాలు మంజూరు చేసి పేద ప్రజలను ఆదుకోవడంతో పాటు సమస్యలను గుర్తించి పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. పట్టణంలోని 13, 14, 28, 29 వార్డు సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆమె మాట్లాడుతూ , పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న పాలన కొనసాగుతోందన్నారు. గతంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఒక్కరోజు కూలి దొరక్కపోతే ఆ గిరిజన కుటుంబం పిల్లాపాపలతో సహా పస్తులు ఉండాల్సిన పరిస్థితులుండేవన్నారు. నేడు జగనన్న పాలనలో పది రోజులు కూలి దొరక్కపోయినా సంక్షేమ పథకాలతో పది రోజులు కుటుంబాన్ని పోషించేకునే పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ జరజాపు దీప్తి , కౌన్సిలర్లు పాంచ్రంకి సన్యాసమ్మ, భవిరెడ్డి గౌతమి, బలభద్రుని శ్రీనివాసరావు, గొర్లి వెంకటరమణ, గిరి రఘు, రాపాక మాధవరావు, వార్డ్ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



మక్కువ: కవిరిపల్లిలో లబ్ధిదారులుకు ధ్రువపత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

ప్రజలకు అండగా..

మక్కువ: ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉండి ఆదుకునేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సరాయివలస, కవిరిపల్లి గ్రామాలలో ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, తహసీల్దార్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు మందులు మానకుండా వాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి శ్యామ్‌కుమార్

పార్వతీపురంటౌన్: హెచ్‌ఐవీ వ్యాధి గ్రస్తులు మందులు మానేయకుండా నిత్యం వాడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రాస్పత్రిలోని ఏఆర్టీ కేంద్రంలో స్వచ్ఛంద సంస్థలతో నెలవారీ సమన్వయ సమావేశాన్ని జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్ర సంస్థ నిర్వహించింది. ఈ సమావేశంలో డాక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల భాగస్వాములకు క్రమం తప్పకుండా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించాలని తెలియజేశారు. వ్యాధిగ్రస్తులకు ఏఆర్టీ మందులతో పాటు వారి భాగస్వాములకు హెచ్‌ఐవీ పరీక్షలు అక్కడే జరిగేలా ఏర్పాటు చేస్తామని, వారు క్రమం తప్పకుండా మందులు వాడేలా చర్యలు తీసుకోవాలని ఏఆర్టీ సెంటర్ సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, జిల్లా సూపర్‌వైజర్ గోపాల్, ఏఆర్టీ కేంద్రం వైద్యాధికారి జగదీష్, డేలాప్లస్ సూపర్‌వైజర్ డి.నాగరాజు, సానిలాల్, విజయ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ ఎం. పద్మ, ఇతర స్వచ్ఛంద సంస్థలు, ఐసీటీసీ డీఎస్ఆర్‌సీ, ఏఆర్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



నెలుపర్తిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సాలూరు: జగనన్న కాలనీ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. సాలూరు మున్సిపల్ పరిధిలోని నెలిపర్తి హౌసింగ్ కాలనీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగనన్న కాలనీలో అప్రోచ్ రోడ్లు, నీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించామని, గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసేలా లబ్ధిదారులను అధికారులు చైతన్య పరచాలని సూచించారు. అనంతరం సాలూరు పట్టణంలోని ఆస్పత్రి భవనాలు, జీగిరాంలోని రైతుభరోసా కేంద్రాన్ని పరిశీలించి, వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట సాలూరు మున్సిపల్ కమిషనర్ హెచ్. శంకరరావు, గృహనిర్మాణ సంస్థ జేఈ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో సంక్షేమ విప్లవం

- ఎమ్మెల్యే కళావతి




అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకువచ్చారని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని పులిపుట్టి గ్రామ సచివాలయం పరిధిలో జోరువానలో పులిపుట్టి, సుందరయ్యగూడ, ఆర్ఆర్ కాలనీ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. తామంతా శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలానికి చెందిన నిర్వాసితులమని ఇక్కడ మాకు కాలనీ ఇచ్చారని, అక్కడ రేషన్‌కార్డులు ఉండడంతో గృహనిర్మాణాలు కట్టుకుందామన్నా ఇబ్బందులు పడుతున్నామని ఆర్ఆర్ కాలనీ వాసులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే మహిళా సంఘాలకు కూడా ఇక్కడ సభ్యత్వం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సంక్షేమ పథకాలు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుండడం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఒకవైపు జోరు వాన కురుస్తున్నా...ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు వెంకటేష్, కృష్ణ, రామారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన



ఓటరు జాబితాపై అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావివలస, రావుపల్లి తదితర గ్రామాలలో ఓటరు జాబితాలను బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి శుక్రవారం పరిశీలించారు. జూలై 21 నుండి ఆగస్టు 21వరకు బూత్‌స్థాయి అధికారులతో ఇంటింట ఓటరు వివరాల విచారణ చేపట్టనున్నారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఫారం - 6ద్వారా ఓటరును నమోదు చేయాలి. ఫారం - 7 ద్వారా వలసలు వెళ్లిన వారిని, మరణించిన వారిని కుటుంబ సభ్యులకు నోటీసులను ఇచ్చి తొలగించాలి. ఆగస్టు 22 నుండి సెప్టెంబర్ 29 వరకు ఓటరు కార్డుపై ఫొటో మిస్ మ్యాచింగ్, క్లారిటీ లేకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు తదితర అంశాలను పరిశీలించడం జరుగుతుంది. సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 16 వరకు ముసాయిదా జాబితా ప్రచురించడం జరుగుతుంది. అక్టోబర్ 17 నుండి నవంబర్ 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు సమర్పించవచ్చు. తుది ఓటరు జాబితా జనవరి 5న ప్రచురించడం జరుగుతుంది. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి ఎల్.గోపాలరావు, బీఎల్‌ఓలు తదితరులున్నారు.

గుమ్మలక్ష్మీపురంలో..

గుమ్మలక్ష్మీపురం: ఓటర్లు ఓటు సవరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.చైతన్యస్రవంతి, వీఆర్వో (బీఎల్వో) అమరావతి అన్నారు. ఎల్విన్‌పేట గ్రామ సచివాలయం 1లో పలువురు ఓటర్లకు ఓటు సవరణలపై ఎన్నికల కమిషన్ ఇచ్చిన అవకాశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. వచ్చే నెల 21వ తేదీ వరకు ఇంటింటికి ఓటరు సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

దళిత కళాకారులను ఆదుకోవాలి



ప్రదర్శన చేస్తున్న డప్పు కళాకారులు

భామిని: డప్పు వాయిద్యాలతో జీవిస్తున్న దళిత కుటుంబాలకు ప్రభుత్వం మూడు ఎకరాల సాగు భూమి ఇచ్చి ఆదుకోవాలని దళిత డప్పు కళాకారుల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మల సంజీవ్, డి.గణేష్ శుక్రవారం డిమాండ్ చేశారు. భామిని మండల కేంద్రంలో డప్పుకళాకారులతో ప్రదర్శన నిర్వహించి సమస్యలపై విన్నవించారు. జూలై 25, 26 తేదీలలో పాతపట్నంలో జరగనున్న అధ్యయన తరగతులు జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. మండల డప్పు కళాకారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

గరుగుబిల్లి: చిరుధాన్యాలు ఆరోగ్యానికి మహాభాగ్యమని జట్టు ట్రస్ట్ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన రైతులకు చిరుధాన్యాల సాగులో మెలకువలు, విత్తన ఎంపికపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ ప్రొక్యూర్మెంట్ ప్రాసెసింగ్, రిటైలింగ్ కోఆపరేటివ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సలహాదారు ముఖేష్ దవే మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాలు చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించడం జరిగిందన్నారు. 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలలో క్యానోవ రకానికి చెందిన చిరుధాన్యం తొమ్మిది రకాల పోషకాలు కలిగివున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. జట్టు ప్రాంగణంలో క్వినావో రకం సాగుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టు డైరెక్టర్ ప్రహరాజ్, నూకంనాయుడు, అన్నపూర్ణ తదితరులున్నారు.

జగనన్న సురక్షతో తీరిన సమస్య



మ్యుటేషన్ పత్రాన్ని అందుకుంటున్న సీతారామ్మూర్తి

సీతానగరం: ఈ ఫొటోలో కనిస్తున్న వ్యక్తి సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన రైతు దళాయి సీతారామ్మూర్తి. ఈయనకు గ్రామంలో స్థిరాస్తి ఉంది. ఆయన కుమార్తె గంగా భవానికి వివాహం చేసి ఇంకో ఇంటికి పంపించారు. సీతారామ్మూర్తి భార్య సత్యవతి పేరున ఉన్న భూమిలో కొంత విస్తీర్ణాన్ని కుమార్తె గంగా భవాని పేరున మూడు సంవత్సరాల క్రితం బొబ్బిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గిఫ్ట్‌డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే తన కుమార్తె పేరున భూమి రెవెన్యూ ఖాతాలో నమోదు చేయాలని మ్యుటేషన్‌కు ఆయన దరఖాస్తు చేశాడు. అయినా ఫలితం లేకపోయింది. జగనన్న సురక్ష పథకం ద్వారా ఇంటింటికి వచ్చిన వలంటీర్లకు మూడు రోజుల క్రితం దరఖాస్తు చేయగా కుమార్తె గంగాభవాని పేరున భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసినట్లు మ్యుటేషన్ పత్రాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో అధికారులు అందజేశారు. దీంతో మూడేళ్లుగా జరగని న్యాయం జగనన్న సురక్ష ద్వారా జరగడం వల్ల సంతృప్తిగా ఉందని, జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నందున మళ్లీ జగన్‌మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి కావాలని కురుకుంటున్నానని సీతారామ్మూర్తి చెబుతున్నాడు.

పట్టణ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పట్టణ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో కొత్తవలస వద్దనున్న దుర్గ చెరువును అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు సుమారు రూ.94 లక్షలు మంజూరు చేయగా పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో పచ్చదనానికి, ఆహ్లాదకరమైన వాతావరణం సమకూర్చేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తూ అమృత్ 2.0 ప్రత్యేక ప్రాజెక్టు ద్వారా చెరువులు, కోనేరులను అభివృద్ధి చేసి పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించి ప్రజలకు చక్కని వాతావరణం అందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ పి.రామప్పల నాయుడు, ఏఈ ఆనంద్, కౌన్సిలర్లు బి.ఆనంద్, ఎస్.లావణ్య, కోఆప్షన్ సభ్యులు ఎం. వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎన్ సదానందం, బి.ఆదినారాయణ, కార్యకర్తలు ఎస్.చంద్ర, జి చిరంజీవి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల దీక్ష విరమణ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటరమణ

సీతానగరం: మండలంలోని వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల వీఆర్‌ఏల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.సూరయ్య ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షను శుక్రవారం సాయంత్రం విరమించారు. దీక్షలో పాల్గొన్న వీఆర్‌ఏలతో సీఐటీయూ జిల్లా నాయకుడు వి.వెంకటరమణ మాట్లాడిన అనంతరం దీక్ష ముగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వెంకటరమణ మాట్లాడుతూ వీఆర్‌ఏలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మూడు రోజుల పాటు దీక్ష చేశారని తెలియజేశారు. ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఎన్వీ రమణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల కుటుంటసభ్యులు, సీఐటీయూ సభ్యులు, వీఆర్‌ఏల సంఘం నాయకులు పాల్గొన్నారు.

24న ఈఎంఆర్‌ఎస్‌ల్లో రెండో విడత కౌన్సెలింగ్

సీతంపేట: భామిని, మెళియాపుట్టిలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్ ఈ నెల 24న నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈపీ గ్రూపుల్లో 26, మెళియాపుట్టిలో 30 సీట్లు ఖాళీలున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు. కొత్తూరులో ఉన్న ఏకలవ్య స్కూల్‌లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్:

మాతా,శిశు ఆరోగ్య శ్రేయస్సుకు వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశ నోడల్ అధికారులకు(సూపర్‌వైజర్స్) పలు ఆరోగ్య కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ గర్భిణులను గుర్తించిన వెంటే నమోదు జరగాలన్నారు. అన్ని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది వద్ద గర్భ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలని సూచించారు. నమోదు జరిగిన వెంటనే అన్ని సాధారణ ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు పూర్తి చేయడం ద్వారా హైరిస్క్ గర్భిణులను త్వరగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టవచ్చని అభిప్రాయ పడ్డారు. ప్రతిరోజూ విధిగా ఐరన్, కాల్షియం మాత్రలు, పోషకాహారం గర్భిణులు తీసుకునేలా చూడాలన్నారు. కాన్పు సమయం దగ్గర పడుతున్నప్పుడు ఏవైనా ప్రమాదకర సూచికలు గుర్తిస్తే ఆలస్యం చేయకుండా వాటి నివారణకు అవసరమైన చికిత్స, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండే రిఫరల్ ఆస్పత్రికి వెంటనే పంపించాలని పేర్కొన్నారు. అరుదుగా ఉండే బ్లడ్ గ్రూప్ ఉన్న గర్భిణులకు ముందస్తుగానే డోనర్స్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రసవం తర్వాత కొన్ని రోజుల వరకు ఆరోగ్య పర్యవేక్షణ చేసి రక్తస్రావం, రక్తహీనత తదితర లక్షణాలు గుర్తిస్తే తక్షణమే వైద్యుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

సేవల్లో నిర్లక్ష్యం వద్దు

నవజాత శిశువుల ఆరోగ్య పరిశీలన కీలకమని శ్వాస తీసుకోవడంలో గాని, పాలు తాగడం, మూత్ర విసర్జనలో ఏవైనా సమస్యలు గుర్తిస్తే ఎస్ఎన్‌సీయూ విభాగానికి రిఫర్ చేయాలని చెప్పారు. వ్యాధినిరోధక టీకాలు సకాలంలో వేయాలని, వీటికి సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న మిషన్ ఇంద్రధనుష్ సర్వే పూర్తి స్థాయిలో జరగాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు గుర్తించడానికి నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే, నివారణ చర్యల్లో భాగంగా దోమల మందు స్ప్రేయింగ్, అందుబాటులో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు ఉంచడం, కిశోరీ బాలికల్లో రక్తహీనత నివారణ, హిమోగ్లోబిన్ పరీక్షలు, ఐరన్ మాత్రలు వేయించడం తదితర అంశాలపై నిర్లక్ష్యం వహించరాదని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, డీఎల్‌ఏటీఓ డాక్టర్ శ్యామ్ కుమార్, ఎపిడిమియాలజిస్ట్‌డాక్టర్ నవీన్, డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, డీపీఓ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు సముచిత స్థానం కల్పించాలి

వీరఘట్టం: వీరఘట్టం రహదారి విస్తరణలో భాగంగా ప్రధాన కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబద్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ఇటీవల తొలగించారు. ఈ విగ్రహాలకు సముచిత స్థానం కల్పించి అందరి సమ్మతితో ముఖ్యమైన కూడళ్లలో పునః ప్రతిష్ట చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. స్థానిక కోదండరామ కల్యాణ మండపంలో జైభీమ్ సంఘం నాయకులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రహదారి విస్తరణ వల్ల రెండు విగ్రహాలు ఒకే కూడలిలో అమర్చడం వీలుకాదని, అందుచే సంఘ సభ్యుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని విగ్రహాలను అమర్చాలని సూచించారు. రోడ్డు విస్తరణ పనులు చకచకా జరుగుతున్నాయని, అయితే భూగర్భంలో ఉన్న తాగునీటి పైపులైన్ పనులు పూర్తి కాకపోవడంతో రోడ్డు పనులకు ఆటంకంగా ఉందని, వెంటనే తాగునీటి పైపులైను పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ డిల్లేశ్వరరావు, ఆర్అండ్‌బీ డీఈ గౌరీశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, జైభీమ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.